బ్లడ్ బ్యాంకుపై విచారణకు కమిటీ

విద్యానగర్, ఫిబ్రవరి 3 : గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కరీంనగర్ బ్లడ్ బ్యాంకుపై వస్తున్న ఆరోపణలపై ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ వేసినట్లు దవాఖాన సూపరింటెండెంట్ గుండా వీరారెడ్డి తెలిపారు. మూడు నెలలుగా దవాఖానకు ఎంతమంది బ్లడ్ ఇచ్చారు, అవి రోగులకు చేరాయా.? అనే అంశాలపై క్షుణ్ణంగా విచారణ చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. ఒకవేళ బ్లడ్‌బ్యాంకులో అవకతవకలు జరిగితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని, నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు.

విద్యార్థులకు అభినందన

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 3 : శాతవాహన విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 7, 2024లో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో భాగంగా హైదరాబాద్‌లోని కాగ్నిజెంట్ కంపెనీలో ఉద్యోగాలు సాధించిన ఏడుగురు అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వారిని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఏడాదికి రెండుసార్లు మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని చెప్పారు. నిరుద్యోగులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకొని ఉద్యోగాలు సాధించాలని సూచించారు.

ఫార్మసీ కళాశాలకు ప్రహరీ నిర్మాణం

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 3 : శాతవాహన విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల క్యాంపస్‌కు ప్రహరీ నిర్మాణం కోసం అనుమతి ఇచ్చినట్లు వీసీ ఆచార్య ఉమేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రహరీ లేకపోవడంతో ఆక్రమణలు జరుగుతున్నాయని, అలాగే వ్యర్థ పదార్థాలు స్థానిక ప్రజలు కళాశాల ప్రాంగణంలో వేయడంతో కళాశాల ఆవరణ కలుషితమయ్యే ప్రమాదం ఉన్నదని తెలిపారు. ఈ క్రమంలో ప్రహరీ నిర్మాణానికి ఆర్ అండ్ బీ కరీంనగర్ ఏవో రాజశేఖర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

చెల్పూర్‌లో ఒకరి ఆత్మహత్య

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 3: హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన చింతరెడ్డి అశోక్ రెడ్డి(45) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. అశోక్ రెడ్డి 15 ఏళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకున్నాడు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తిరుమల్ గౌడ్ తెలిపారు.

అర్హులకు జవాన్ల పోస్ట్ ఇవ్వాలి

కార్పొరేషన్, ఫిబ్రవరి 3 : నగరపాలక సంస్థల పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న వారిలో అర్హులైన వారిని జవాన్లనుగా నియమించాలని బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకులు సోమవారం కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మాజీ ప్రజాప్రతినిధుల వద్ద పనిచేసిన వారికి జవాన్ పోస్టులు ఇవ్వడం సరికాదని, ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

వీణవంక, ఫిబ్రవరి 3: రెడ్డిపల్లి గ్రామంలో సోమవారం షటిల్ టోర్నమెంట్‌ను ఎస్ఐ తిరుపతి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. అనంతరం ఎస్ఐ తిరుపతి మాట్లాడుతూ, క్రీడలను అడిగొప్పుల సాయితేజ తన సొంత ఖర్చులతో నిర్వహించడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు అడిగొప్పుల సంపత్, క్రీడాకారులు సాయికుమార్, చింతల అరవింద్, గణేశ్, గట్టు నాగరాజు, చిన్నాల శ్రీకాంత్, చింతల తిరుపతి పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

గంగాధర, ఫిబ్రవరి 3 : సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాయకుడు రామిడి సురేందర్ అన్నారు. సోమవారం మండలంలోని తాడిజెర్రి గ్రామంలో బీరప్ప మహంకాళి దేవాలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రామిడి రాజిరెడ్డి, వరాల సుధాకర్, శ్రీరాం లక్ష్మీనారాయణ, ఈర్ల మహిపాల్, కురుమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

గంగాధర, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలోని పురాతన వేంకటేశ్వర స్వామి ఆలయం పునర్నిర్మాణం కోసం గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సామంతుల శ్రీనివాస్ రూ.20 వేలు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఇక్కడ మాజీ సర్పంచ్ మడ్లపెల్లి గంగాధర్, గ్రామస్తులు దొడ్ల ఎల్లారెడ్డి, వేముల రాములు, దేశెట్టి నర్సయ్య, పొన్నం పరశురాములు, పొన్నం తిరుపతి, పొన్నం జలందర్, పొన్నం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'ఆశ' బతికొచ్చింది..

డ్యూటీ లిస్ట్‌లో చనిపోయిన ఆశ వర్కర్ • బ్రహ్మోత్సవాలకు డ్యూటీ వేసిన అధికారులు • జిల్లా ఉన్నతాధికారి సంతకంతో జాబితా విడుదల • నివ్వెర పోయిన వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు



గతనెల 20న డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి డ్యూటీలు వేస్తూ విడుదల చేసిన సర్క్యులర్

విద్యానగర్, ఫిబ్రవరి 3 : శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో విధులు నిర్వహించేందుకు ఒక ఆశ వర్కర్ బతికొచ్చింది. మీరు చదివింది నిజమే.. కరీంనగర్‌లోని మార్కెట్ రోడ్‌లో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో విధులు నిర్వహించేందుకు మూడేళ్ల కింద చనిపోయిన పద్మ అనే ఆశ వర్కర్‌కు విధులు వేశారు మన ఘనత వహించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు. అంతే కాదు.. రెండున్నరేళ్ల కింద ఏఎన్ఎంగా ఇదే శాఖలో ఉద్యోగం వచ్చిన మరో ఆశ వర్కర్ వినోదకు కూడా ఇక్కడ విధులు వేశారు. విచిత్రం ఏమిటంటే గత నెల 20న ఇక్కడ విధుల నిర్వహణకు డ్యూటీల జాబితాను విడుదల చేసినా బ్రహ్మోత్సవాలు మొదలయ్యే రోజు వరకు గ్రహించలేక పోయారు. సోమవారం వీరిద్దరు విధులకు హాజరు కాకపోవడంతో వెనక్కి తిరిగి ఆలోచించగా అసలు విషయం బయటకు వచ్చింది. ఈ విషయాన్ని సంబంధిత జిల్లా ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లగా తనకేమీ తెలియదని సెక్షన్ అధికారిని అడగమని చెప్పడం, జరిగిన పొరపాటును సరిదిద్దుకునేందుకు పాత తేదీల్లో కొత్త జాబితాను విడుదల చేయడం వెంట వెంటనే జరిగిపోయాయి.

ఆ ఇద్దరికి అక్కడ డ్యూటీ..

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారు. ఎవరు ఏ విధులు నిర్వహిస్తున్నారో అర్థంకాని పరిస్థితి శాఖలో నెలకొన్నది. ఒక్కో సెక్షన్‌కు ఒక్కో అధికారి పర్యవేక్షిస్తుంటారు. అయినా పొరపాట్లు జరుగుతూనే ఉంటాయి. ఇదేమిటని అడిగే వారు కరువయ్యారు. దీంతో శాఖ ఉద్యోగులు, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా జరిగిన ఒక ఉదంతం ఇందుకు నిదర్శనం. కరీంనగర్‌లోని బుట్టి రాజారాం కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో పద్మ అనే మహిళ ఆశ వర్కర్‌గా పనిచేస్తూ మూడేళ్ల కింద చనిపోయింది. అలాగే మోతాజ్‌ఖాన అర్బన్ హెల్త్ సెంటర్‌లో పనిచేసే మరో ఆశ వర్కర్ వినోదకు రెండున్నరేళ్ల కిందనే ఇదే శాఖలో ఏఎన్ఎంగా ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం ఆమె తిమ్మాపూర్ పీహెచ్‌సీలో పనిచేస్తున్నారు. అయితే, వీరిద్దరికి కరీంనగర్‌లోని మార్కెట్ రోడ్‌లో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో డ్యూటీలు వేశారు. గత నెల 20న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సంతకంతో అధికారికంగా ఈ జాబితా సిద్ధమై సర్కులెట్ కూడా అయ్యింది. అయితే, బ్రహ్మోత్సవాల్లో విధుల నిర్వహణకు సర్క్యులర్ జారీ చేసిన అధికారులు ఈ విషయాన్ని మర్చిపోయినట్లున్నారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన రోజు వరకూ పద్మ చనిపోయినట్లు, వినోదకు ఏఎన్ఎంగా ఉద్యోగం వచ్చినట్లు గ్రహించ లేక పోయారు.

విధులకు ఎందుకు రాలే..?

చనిపోయిన పద్మ, ఏఎన్ఎంగా ఉద్యోగం వచ్చిన వినోదతోపాటు మరో ఇద్దరు ఆశ వర్కర్లకు ఇక్కడ డ్యూటీలు వేశారు. మిగిలిన ఇద్దరు బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన సోమవారం విధులకు హాజరయ్యారు. అయితే, మిగిలిన ఇద్దరు ఎందుకు విధులకు హాజరు కాలేదని ఆరా తీస్తేగానీ అసలు విషయం బయటకు రానట్లు తెలుస్తోంది. పద్మ చనిపోయినట్లు, వినోదకు ఉద్యోగం వచ్చినట్లు తెలుసుకున్న అధికారులు ఒక్కసారిగా కంగు తిన్నారు. అప్పటికప్పుడు పాత తేదీల్లో సర్క్యులర్ ఇచ్చి అందులో ఉన్న పేర్లను మార్చేశారు. ఇంతకీ ఇదంతా ఎలా జరిగిందనే చర్చ వైద్య, ఆరోగ్య శాఖలో మొదలైంది. ఈ శాఖ కార్యాలయం నుంచి గత నెల 20న విడుదలైన సర్క్యులర్‌లో చనిపోయిన పద్మ, ఉద్యోగం వచ్చిన వినోద పేర్లు ఇవ్వడంలో ఎక్కడ నిర్లక్ష్యం జరిగిందనే విషయంపై చర్చించుకుంటున్నారు. నిజానికి వైద్య, ఆరోగ్య శాఖ గతేడాది ఇవే బ్రహ్మోత్సవాలకు డ్యూటీలు వేసిన పాత జాబితానే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. సదరు అధికారి కూడా విచారించకుండా గుడ్డిగా ఫైల్‌పై సంతకం పెట్టినట్లు స్పష్టమవుతోంది. ఈ విషయం వెలుగులోకి రాగానే ఆగమేఘాలపై పాత తేదీలో మరో సర్క్యులర్ ఇచ్చి అందులో అందరు మేల్ ఉద్యోగులకే డ్యూటీలు వేయడం కొసమెరుపు. ఈ విషయమై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణను వివరణ కోరే ప్రయత్నం చేయగా, సంబంధిత సెక్షన్ అధికారిని అడగండి అంటూ ఫోన్ పెట్టేశారు. సదరు సెక్షన్ అధికారిని సంప్రదించగా.. జరిగిన పొరపాటుపై వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారు. కాగా, ఇంత పెద్ద వైద్య, ఆరోగ్య శాఖలో పదుల సంఖ్యలో ఉద్యోగులు ఉండగా ఎప్పటి డ్యూటీలు అప్పుడు వేయాల్సింది పోయి పాత లిస్ట్‌ను సిఫారసు చేయడం ఏమిటని ముక్కున వేలేసుకుంటున్నారు. కేవలం డాటా ఎంట్రీ ఆపరేటర్లపై ఆధారపడి ఉండడంతో పాటు ఉద్యోగులంతా సమయపాలన పాటించకపోవడం, డిప్యూటేషన్‌పై పని చేయడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పిబ్రవరి 3న డ్యూటీలు మార్పు చేసి విడుదల చేసిన సర్క్యులర్

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఘన స్వాగతం

ఎమ్మెల్సీ కవితకు బొట్టు పెట్టి స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ మహిళా నాయకులు

కార్పొరేషన్, ఫిబ్రవరి 3: జిల్లా కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఘన స్వాగతం లభించింది. నగరంలోని కోతిరాంపూర్ వద్ద బీఆర్ఎస్ నాయకులు ఆమెకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. భారీగా తరలి వచ్చిన విద్యార్థినులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు.

తనను కలిసేందుకు వచ్చిన విద్యార్థినులతో కరచలనం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

కమాన్ ఫార్మసీని ప్రారంభించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కమాన్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కమాన్ ఫార్మసీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కవిత

కార్పొరేషన్, ఫిబ్రవరి 3: నగరంలోని కమాన్ చౌరస్తా ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన కమాన్ ఫార్మసీని సోమవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఫార్మసి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫార్మసీ రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రజలకు సేవ చేయాలని సూచించారు. అనంతరం పూజలు చేసి కౌంటర్‌లో కూర్చొని, అన్ని శుభాలు కలుగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నాయకులు చల్ల హరిశంకర్, రవీందర్‌సింగ్, హరి ప్రసాద్, అనిల్‌గౌడ్, తాటి ప్రభావతి, పావని తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రనీల్‌బాబుకు శుభాకాంక్షల వెల్లువ

ఇంద్రనీల్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

సైదాపూర్, ఫిబ్రవరి 3: మండలకేంద్రంలో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ తనయుడు యువనేత వొడితల ఇంద్రనీల్‌బాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సింగాపురంలో మాజీ ఎమ్మెల్యే నివాసంలో యువనేతను కలిసి ఆయనతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి చెల్లల్ల రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు మాదం స్వామియాదవ్, పోతిరెడ్డి హరీశ్‌రావు, దూల సురేశ్, మాదం మహేశ్, మాదం రమేశ్, గోనెల రాజ్‌కుమార్, పోతరాజు రమేశ్, హరీశ్ ఉన్నారు.

భూకబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 3: నగర శివారులోని చింతకుంట పరిధిలో గల రాజీవ్ గృహకల్ప-2లో భూకబ్జాకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, కాలనీవాసులు డిమాండ్ చేశారు. కాలనీలో గల సర్వేనెం.142లో భవిష్యత్ అవసరాల కోసం పలు చోట్ల ఖాళీ స్థలాన్ని అధికారులు వదలగా, గృహకల్ప సైట్ 2లోని 26వ ప్లాటు యజమాని మూడు గుంటల భూమి కబ్జా చేసి కిరాణా దుకాణం ఏర్పాటు చేసినట్లు ఆరోపించారు. ఖాళీగా ఉన్న మిగతా స్థలంలో తాజాగా భారీస్థాయిలో రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టినట్లు సోమవారం కలెక్టర్‌కు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే పరిశీలించి ఆక్రమిత స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు నిలిపివేసి, కబ్జాకు పాల్పడుతున్న సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మొలంగూర్‌లో ప్రభుత్వ భూమి సర్వే

శంకరపట్నం, ఫిబ్రవరి 3: మొలంగూర్ గ్రామంలోని సర్వే నంబర్ 703లోని ప్రభుత్వ భూమిలో సోమవారం సర్వేయర్ రాజేంద్రప్రసాద్ సర్వే నిర్వహించారు. మొలంగూర్ గ్రామ శివారులో గల ఈ ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 100 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లకు పంపిణీ చేయాలని గ్రామానికి చెందిన యువజన సమితి అధ్యక్షుడు మోరె గణేశ్ పోరాటం చేస్తున్నాడు. గ్రామంలో వందల ఎకరాల శిఖం, పరంపోగు, కుంటలు, ఆలయ భూములు ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని ఆక్రమణదారుల చెరనుంచి విడిపించాలని డిమాండ్ చేస్తుండగా, ఈ క్రమంలో అధికారులు సోమవారం సర్వే చేశారు. తహసీల్దార్‌కు సర్వే రిపోర్టును అందజేయనున్నట్లు సర్వేయర్ తెలిపారు. ఇక్కడ పలువురు గ్రామస్తులు ఉన్నారు.

నేడు పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

విద్యానగర్, ఫిబ్రవరి 3 : కరీంనగర్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులకు క్యాన్సర్ డేను పురస్కరించుకొని మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నరేశ్ ఎనమల్ల, డాక్టర్ సిరిపురం నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐఎంఏ, గైనకాలజీ అసోసియేషన్, ఉమెన్ డెవలప్‌మెంట్ వింగ్, కరీంనగర్ ఆధ్వర్యంలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌పై అవగాహన శిబిరం, ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని కళాభారతిలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, విశిష్ట అతిథిగా వెంకటరమణ హాజరుకానున్నారని తెలిపారు. మహిళా పారిశుధ్య కార్మికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మిక హక్కులను హరించేలా కేంద్రం విధానాలు

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వ విధానాలు కార్మిక, కర్షక హక్కులను హరించేలా ఉన్నాయని, వీటికి వ్యతిరేకంగా చేపట్టనున్న ఈనెల 5న నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ పిలుపునిచ్చారు. సోమవారం బద్దం ఎల్లారెడ్డి భవనంలో పలు కార్మిక సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిరసనల కార్యక్రమంలో అన్ని ప్రజా కార్మిక, సంఘాలు పాల్గొనాలని కోరారు. ఇక్కడ వామపక్షాల అనుబంధ కార్మిక సంఘాల నాయకులు బుచ్చన్నయాదవ్, అశోక్, సృజన్‌కుమార్, రాజిరెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

వైన్స్ షాప్‌లపై మున్సిపల్ అధికారుల దాడులు

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 3: పట్టణంలోని పలు వైన్సులపై మున్సిపల్ అధికారులు సోమవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. వైన్స్ షాపుల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించడంపై అధికారులు వైన్స్ యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగేంద్ర వైన్స్, మందాకిని వైన్స్ యజమానులకు 5వేల రూపాయల చొప్పున జరిమానా విధించారు. మరోసారి పారిశుధ్యం లోపిస్తే షాపులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ కే సమ్మయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆర్ భూపాల్ రెడ్డి , శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం కిషన్ రావు, వార్డు అధికారులు ఆర్ బాలగంగాధర్ తిలక్, సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ నూతన ఏసీ కార్యాలయం ప్రారంభం

కార్యాలయ ఆవరణలో మొక్కను నాటుతున్న ఏసీ, అధికారులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 3: వసంత పంచమిని పురస్కరించుకుని దేవాదాయ శాఖ నూతన ఉమ్మడి కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ ఎన్ సుప్రియ మాట్లాడుతూ, 25 సంవత్సరాలుగా కోర్ట్ సర్కిల్‌లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి కళ్యాణ మండపం మొదటి అంతస్తులో ఉమ్మడి కరీంనగర్ జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయ కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. పరిపాలన సౌలభ్యం కోసం ఈ కార్యాలయాన్ని దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల అనుమతితో ప్రశాంత్‌నగర్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలోని కల్యాణ మండపం గ్రౌండ్ ఫ్లోర్‌లో మార్చినట్లు పేర్కొన్నారు. ఈ నూతన కార్యాలయంలో ఈ నెల 12వ తేదీ నుంచి కార్యకలాపాలు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఫిబ్రవరి 3: నగరంలోని పలు ఫీడర్ల పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-1, 2 ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, ఎం లావణ్య వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు మార్క్ ఫెడ్ ఏరియా, ప్రగతి నగర్, రాంనగర్, మంకమ్మతోట, లేబర్ అడ్డ, రాజీవ్ పార్కు, పద్మనగర్ పారమిత స్కూల్ ఏరియా

- మధ్యాహ్నం 12.30నుంచి 1.30 గంటల వరకు మెహర్ నగర్ టెంపుల్ ఏరియా, ఈఎన్ గార్డెన్ ఫంక్షన్ హాల్ ఏరియాకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఇంటికో డప్పుతో కదలిరావాలి

వీణవంక, ఫిబ్రవరి 3: హైదరాబాద్‌లో నిర్వహించే లక్షల డప్పులు.. వేయి గొంతులు కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి ఇంటికో డప్పు.. ఊరికో బస్‌తో కదలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో లక్షల డప్పులు.. వేయి గొంతులు కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు మోరె అరుణ్, ఎమ్మెస్పీ జిల్లా ప్రధానకార్యదర్శి అంబాల మధునయ్య, జిల్లా కార్యదర్శులు పర్ల పెల్లి తిరుపతి, కండె మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

బీఈడీ ఫీజు చెల్లింపునకు గడువు 13

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 3 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 13వ తేదీ ఆఖరు అని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుము రూ. 500తో 17వ తేదీ వరకు చెల్లించవచ్చని వివరించారు

మిషన్ భగీరథ పైపులైన్ మంజూరు చేయాలి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 3: నగునూర్ గ్రామ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున తీగలగుట్టపల్లి నుంచి నగునూర్ వాగు వరకు మిషన్ భగీరథ ద్వారా పైపులైన్ వేయించాలని మాజీ సర్పంచులు ఉప్పుల శ్రీధర్, జక్కం నర్సయ్య సోమవారం జిల్లా పరిషత్ సీఈవో పవన్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మిషన్ భగీరథ ద్వారా పైపులైన్ వేయించి తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- పీఆర్‌సీ బృందసభ్యుడు డాక్టర్ వీ శ్రవణ్‌కుమార్

మానకొండూర్, ఫిబ్రవరి 3: పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైద్యసిబ్బంది మెరుగైన వైద్య సేవలందించాలని గాంధీగ్రామ్, తమిళనాడుకు చెందిన పీఆర్‌సీ(పాపులేషన్ రీసెర్చ్ సెంటర్) బృంద సభ్యుడు డాక్టర్ వీ శ్రవణ్‌కుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో పాటు అన్నారం సబ్‌సెంటర్‌ను పీఆర్‌సీ బృంద సభ్యులు సందర్శించారు. పీహెచ్‌సీ, సబ్‌సెంటర్‌లలో ప్రజలకు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బీపీ, డయాబెటిక్, క్యాన్సర్ రోగులకు తప్పని సరిగా వైద్యసేవలందించాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సనా జవేరియా, డాక్టర్ సల్మాన్, టీ స్వామి (డీపీఏ ఎన్ఎహెచ్ఎం), సీహెచ్‌వో రాజూ నాయక్, సూపర్‌వైజర్లు జుబేర్, స్నేహలత, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మానకొండూర్ పీహెచ్‌సీలో వసతులను పరిశీలిస్తున్న పీఆర్‌సీ బృంద సభ్యులు

గంగాధర పీహెచ్‌సీ సందర్శన

గంగాధర, ఫిబ్రవరి 3 : గంగాధర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పాపులేషన్ రిసేర్చ్ సెంటర్ సెంట్రల్ టీం సభ్యులు సోమవారం సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీంచారు. సిబ్బందితో మాట్లాడి దవాఖానలో అందుతున్న సేవలను తెలుసుకున్నారు. రికార్డులు, ఆన్‌లైన్ పోర్టల్, ఐఈసీ, ల్యాబ్, ఫార్మసీ, వార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తమిళనాడు గాంధీగ్రామ్‌కు చెందిన డాక్టర్ శ్రావణ్‌కుమార్, జిల్లా సభ్యులు డాక్టర్ శ్వేత, సనాజవేరియా, స్వామి తదితరులు ఉన్నారు.

కరెంట్ మోటర్లు, సర్వీసు వైర్లు పోతున్నయ్

- కాస్త పట్టించుకోండి సారూ..

శంకరపట్నం, ఫిబ్రవరి 3: అర్కండ్ల శివారులో తరచూ వ్యవసాయ బావుల వద్ద కరెంటు మోటర్లు, సర్వీసు వైర్లు చోరీకి గురవుతున్నాయని గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. కొద్ది రోజులుగా గ్రామ శివారులోని వ్యవసాయ బావుల వద్ద కరెంటు మోటర్లు, సర్వీసు వైర